విలువలు పాటించాలి — నారంశెట్టి ఉమామహేశ్వరరావు

జాతి గౌరవంబు నీతి పై నిలుచును/

నీతి లేక యున్న జాతి చెడును/

నీతి గల్గు జాతి నిజమైన జాతి రా/

వినము భారతీయ వీర సుతుడా/

అన్నారు శ్రీ సత్య సాయి బాబా.

ఆ మాటలు అక్షర సత్యాలు. ఒక జాతి యొక్క విలువ ఆ జాతి గడించిన భౌతిక సంపద మీద మాత్రమే ఆధారపడదు. ఒక జాతి గొప్పతనం ఆ దేశం సమకూర్చుకున్న సైనిక శక్తి మీద మాత్రమే ఆధారపడదు . ఒక దేశం ప్రతిష్ట ఆ దేశానికి ఉన్న విశాల భూభాగం మీద మాత్రమే ఆధారపడదు. ఒక జాతి గౌరవం ఆ జాతి యొక్క జనాభా మీద మాత్రమే ఆధారపడదు. ఆ జాతి గౌరవం ఆ దేశ ప్రజల నైతిక ప్రవర్తన మీద ఆధారపడి ఉంటుంది. ఆ దేశాన్ని పాలిస్తున్న పాలకుల నీతి, నిజాయితీ మీద కూడా ఆధారపడి ఉంటుంది. సంఘంలో నివసించే ప్రతి ఒక్కరికి నీతి ముఖ్యం . ప్రతి జాతికి నీతి అవసరం. జీవితానికి ఆదర్శం నీతి. నీతి లేని వారిని సమాజం నీచంగా చూస్తుంది. అలాంటి వాళ్ళని నమ్మడానికి ఎవరూ ఇష్టపడరు. నీతిలేని జాతిని ప్రపంచం గుర్తించదు. సరైన గౌరవం దక్కదు. నీతి లేనివాడు మేధావి అయినా, శాస్త్రవేత్త అయినా, రాజకీయ నాయకుడైనా, వ్యాపారవేత్త లేదా విద్యావేత్త అయినా చులకనగానే చూస్తారు. వారి దేశానికి మంచి జరగదు. సరికదా అప్రతిష్ట వస్తుంది. అందుకే ప్రజలందరూ నీతి నిజాయితీ వంటి విలువలను పాటించడం ఎంతైనా అవసరం .

పిల్లలూ ! ఇప్పటికే మీకు అర్థమై ఉంటుంది. ఈ నెల మనం తెలుసుకోబోతున్న అంశం 'విలువలు పాటించాలి'. విలువల్ని పాటించడమనే విషయం మీద అవగాహన పెంచుకుందాం. నిత్య జీవితంలో విలువల్ని పాటిస్తూ ఉన్నత ప్రమాణాలు సృష్టిద్దాం.

మంచి చెడులను వివేచించి, సరైన మార్గంలో నడవడానికి అవసరమైన సూత్రాలనే విలువలు అంటారు. ఇవి వ్యక్తుల జీవితాల్లో, సామాజిక సంబంధాల్లో, వృత్తిపరమైన రంగాల్లో మార్గదర్శకంగా ఉంటాయి. నైతిక విలువలు వ్యక్తుల్ని బాధ్యతాయుతంగా, నిజాయితీగా, కరుణతో ఇతరుల్ని గౌరవించేలా చేస్తాయి. మనిషికి బుద్ధి, జ్ఞానం, చదువు, డబ్బు ఉండొచ్చు. వాటికి తోడు మంచి విలువలు ఉంటేనే నిజమైన మనిషి కాగలడు. మంచి విలువలున్న వ్యక్తిని అందరూ గౌరవిస్తారు. అలాంటివారికి అందరి మనసుల్లో స్థానం లభిస్తుంది.

నిత్య జీవితంలో పాటించాల్సిన మంచి లక్షణాలు కొన్ని ఉన్నాయి. నిజాయతీ, వినయం, క్రమశిక్షణ, సహాయ గుణం, క్షమా గుణం , ప్రేమాభిమానాలు మొదలైనవి మనిషిని మనిషిగా నిలబెట్టే మానవీయ గుణాలు. ఒక వ్యక్తి యొక్క ప్రవర్తన, నిర్ణయాలు మరియు సామాజిక సంబంధాలపై గట్టి ప్రభావాన్ని చూపేవి విలువలు. మనుషుల్లో నైతిక విలువలు ఏర్పడడానికి వ్యక్తిగత నమ్మకాలు, సాంస్కృతిక ప్రభావాలు, సామాజిక నిబంధనలు కూడ సహాయపడతాయి.

మనుషులకు తప్పనిసరిగా ఉండాల్సిన మంచి లక్షణం గుణం. అనగా శీలం. సద్గుణం అంటే సచ్ఛీలం. మంచి గుణం, మంచి నడత, మంచి సంస్కారం అని చెప్పవచ్చు. ఎన్ని చదువులు చదివినప్పటికీ మంచి శీలం లేని వ్యక్తికి విలువ తక్కువ. శీలమే మనుషులకు అలంకారం. సామాన్యమైన వాళ్ళు బాహ్య సౌందర్యం చూసి విలువ ఇస్తారేమో కానీ సచ్ఛీలానికి ప్రాధాన్యత ఇస్తాడు దేవుడు. సచ్ఛీలం లేని వ్యక్తి ఏ రంగంలోనూ రాణించలేడు. అష్టైశ్వర్యాలు సంపాదించినా, అధికారాన్ని పొందినా సరే శీలం గనుక లేకపోతే వాటన్నిటినీ కోల్పోయే ప్రమాదం ఉంది.

ఆంగ్లంలో ఒక సామెత ఉంది.

IF WEALTH IS LOST NOTHING IS LOST

IF HEALTH IS LOST SOMETHING IS LOST

IF CHARACTER IS LOST EVERYTHING IS LOST

దాని భావం 'డబ్బు పోయినా, హోదా పోయినా, ఆరోగ్యం తగ్గినా ఫరవాలేదు . కానీ శీలం పోతే సర్వస్వం పోయినట్టే'. ఆ సత్యాన్ని నిరూపించే కథ పురాణాల్లో ఉంది. అది తెలుసుకుందాం.

దానవరాజు హిరణ్యకశిపుడి కుమారుడు ప్రహ్లాదుడు . గొప్ప విష్ణు భక్తుడు. పుణ్య కర్మలెన్నో చేసాడు. దానధర్మాలు, లెక్కకు మించి యజ్ఞ యాగాదులు నిర్వహించడంతో . ఆయనని ఇంద్ర పదవి వరించింది. ఆ స్థానంలో ఉండి, పదవి కోల్పోయిన ఇంద్రుడు విచారంతో దేవతల గురువు బృహస్పతి దగ్గరకు వెళ్లాడు. తనకు మళ్ళీ పదవి వచ్చే విధంగా చేయమని ప్రార్థించాడు. అప్పుడు బృహస్పతి "ఇంద్రా! ప్రహ్లాదుడు దానాలు ఇచ్చే సమయంలో యాచకుడి రూపంలో అతని దగ్గరకు వెళ్లి శీలాన్ని దానంగా ఇమ్మని ప్రార్థించు. నీకు మేలు జరుగుతుందని" చెప్పాడు . ఇంద్రుడు ప్రహ్లాదుడిని కలిసి శీలాన్ని దానంగా ఇవ్వమని యాచించాడు.

" ఒట్టి శీలం వల్ల ప్రయోజనమేముంది? ఇంకేదైనా అడిగితే ఇస్తాను. మాణిక్యాలు , భూసంపద, గోసంపద ఇంకేమైనా తీసుకో" అని బదులిచ్చాడు ప్రహ్లాదుడు. అవేవీ వద్దన్నాడు యాచకుడి రూపంలోని ఇంద్రుడు . శీలం మాత్రమే దానమిమ్మన్నాడు. "ఇస్తున్నాను . తీసుకో" అని మాట పలికాడు ప్రహ్లాదుడు.

మరుక్షణం ప్రహ్లాదుని శరీరం నుండి ఒక తేజస్సు బయటకు వచ్చి ఇంద్రుడిలో కలిసిపోయింది. ఆ తేజస్సుని చూసి "ఎవరు నువ్వు" అని ప్రహ్లాదుడు అడిగాడు. "నేను మీ శీలాన్ని. నన్ను దానం చేసినందువల్ల అతనిలో ప్రవేశిస్తున్నాను" అని బదులు చెప్పింది.

కాసేపటికి ప్రహ్లాదుడి శరీరం నుండి మరొక తేజస్సు బయటకు వచ్చింది. దానిని కూడా "నువ్వెవరు" అని ప్రశ్నించాడు ప్రహ్లాదుడు. "నేను మీ శౌర్యాన్ని. శీలం యొక్క సేవకున్ని . శీలం ఉన్నంతకాలం సేవించాను. ఇప్పుడు శీలం వెళ్లిపోవడంతో నేనూ వెళ్ళిపోతున్నాను. శీలం లేని చోట ఉండలేను" అని జవాబు చెప్పింది.

మరి కాసేపటికి మరొక తేజం ప్రహ్లాదుడి శరీరం నుండి బయటకు వచ్చి ఇంద్రుడి శరీరంలో ప్రవేశించడాన్ని చూశాడు ప్రహ్లాదుడు. " నువ్వెవరో చెబుతావా" అని ఆమెను ప్రశ్నించాడు . "నేను రాజ్యలక్ష్మిని. నేనూ శీలం సేవకురాలనే. శీలాన్ని వెంబడించి వెళ్లి పోతున్నాను" అని చెప్పింది.

ప్రహ్లాదుడు తన శీలాన్ని దానం చేయడం వల్ల శౌర్యాన్ని, రాజ్యలక్ష్మిని కూడా కోల్పోయాడు. తన అధికారాన్ని, సమస్త వైభవాలను కోల్పోయాడు. యాచకుడి రూపంలో వచ్చిన ఇంద్రుడు తిరిగి తన పదవిని పొందాడు. ఏది కోల్పోయినా సంపాదించగలం కానీ శీలం కోల్పోతే సమస్తము కోల్పోతామని చెబుతాయి గ్రంథాలు.

జీవితంలో విజయం సాధించడం అంటే పాఠశాలలో మొదటి ర్యాంకు పొందడం, పెద్ద కంపెనీలో ఎక్కువ జీతంతో ఉద్యోగం పొందడం, అధికారంలో స్థానం సంపాదించడం కాదు. నిజమైన విజయం అంటే మంచి మనిషిగా ఎదగడం. మంచి మనిషిగా ఎదగాలంటే చదువుతో పాటు మంచి విలువలు నేర్చుకుని పాటించాలి. అవే జీవితానికి మార్గదర్శకాలు అవుతాయి. ప్రతి ఒక్కరు ఎటువంటి మోహాలకు , ప్రలోభాలకు, లొంగకుండా శీలాన్ని కాపాడుకోవాలి. అలాంటి వారి గురించి మాట్లాడాల్సిన సందర్భంలో ఛత్రపతి శివాజీ ముందుగా గుర్తొస్తారు. శత్రురాజుని ఓడించి అతని కుమార్తెను తెచ్చి శివాజీ మహారాజ్ కి కానుకగా సమర్పించగా ఆమెను ఒక ఆడపడుచుగా గౌరవించాడు ఆయన. ఆమె రాజ్యానికి తిరిగి పంపించిన గొప్ప సంస్కారం ఆయనది. ఇలాంటి ఉత్తమ నడవడిక అలవరచుకోవడం అవసరం.

మంచి లక్షణాలు అలవరచుకుని జీవితంలో ఆచరించడమే విలువల్ని పాటించడం అని చెప్పవచ్చు. నిజాయితీగా ఉండటం, అబద్ధం చెప్పకపోవడం, వినయంగా ఉండటం , పెద్దల్ని గౌరవించటం, క్రమశిక్షణతో మెలగడం, చెప్పిన సమయానికి పనులు పూర్తి చేయటం, అవసరంలో ఉన్నవారికి సహాయ పడటం, సామరస్యంగా అందరితో కలిసి మెలిసి ఉండటం మొదలైనవన్నీ మానవులు తప్పనిసరిగా పాటించాల్సిన విలువలు.

విలువలు పాటించడం వల్ల ప్రయోజనాలున్నాయి. మనుషుల మధ్య నమ్మకం పెరుగుతుంది. నిజాయితీ ఉన్న వారిని అందరూ విశ్వసిస్తారు. సమాజం మంచి దిశగా మారుతుంది. మంచి విలువలున్న వ్యక్తులు ఉన్న చోట తప్పక మంచి మార్పు వస్తుంది. వ్యక్తుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. మంచి పనులు

చేసే వారిలో ధైర్యం, నిబద్ధత పెరుగుతుంది. ఇతరులకు ఆదర్శంగా నిలుస్తారు. అలాంటివారిని ఆదర్శంగా తీసుకుని వారి ప్రవర్తన నుండి స్ఫూర్తిని పొంది మరెంతో మంది ఆ దిశగా అడుగులు వేస్తారు.

హీనుడెన్ని విద్యలిల నభ్యసించిన/

ఘనుడుగాడు మొఆకు జనుడె గాని /

పరిమళములు గర్దభము మోయ ఘనమౌనె /

విశ్వదాభిరామ వినుర వేమ!

అంటారు కవి వేమన.

దాని భావమేమంటే ఎంతటి ఉన్నత విద్యావంతుడైనా , బహు గ్రంథ పారంగతుడైనా మూర్ఖుడు ఎప్పటికీ గొప్పవాడు కాలేడు. సుగంధ పరిమళ ద్రవ్యాలను మోసినంత మాత్రాన గాడిద గొప్పదౌతుందా? గాడిద గాడిదే. మూర్ఖుడు మూర్ఖుడే. వారిలో మార్పు రాదు.

కవి వేమన పద్యంలో చెప్పినట్టే విలువలు పాటించని వారికి సమాజంలో తగిన గౌరవం దక్కదు. విలువలు పాటించడం అన్ని రంగాలకు అవసరం. వ్యక్తులు, సంస్థలు , కార్యాలయాలు ఒకటేమిటి ప్రతిచోటా విలువల్ని పాటించాలి.

మనుషులు తప్పనిసరిగా పాటించాల్సిన కొన్ని విలువలు గురించి వివరంగా తెలుసుకుందాం.

ముందుగా నైతిక విలువలు. తప్పు, ఒప్పులు తెలుసుకుని సమాజంలో ప్రవర్తించాలి మనుషులు. నైతిక విలువలు ప్రజల మనసుల్లో ఒక దిక్సూచిలా మారి పనిచేస్తాయి. నిజం మాట్లాడటం, అబద్ధాలు చెప్పకపోవడం, ఇతరులకు సహాయం చేయడం, దయగా ఉండటం, పరాయి వారి వస్తువులను అడగకుండా తీసుకోకపోవడం వంటివి నైతిక విలువలు. ఉదాహరణకు ఏదైనా వస్తువు లేదా డబ్బు దొరికితే దాన్ని అసలు యజమానికి తిరిగి ఇవ్వడం అనేది నైతిక విలువ. నైతిక విలువలు ప్రజల్ని నమ్మకమైన, నిజాయితీగల వ్యక్తులుగా తీర్చిదిద్దుతాయి. నిజాయతీకి దక్కాల్సిన గౌరవం తప్పక దక్కుతుంది.

మరచిపోయి వదిలేసిన డబ్బుల సంచిని యజమానికి తిరిగి అప్పగించిన ఆటో డ్రైవర్ , బస్సు డ్రైవర్ అనే వార్తల్ని అప్పుడప్పుడు దినపత్రికల్లో చదువుతుంటాం. వారి ఫోటోలు ప్రచురిస్తూ పత్రికలు వార్తలు రాస్తున్నాయంటే వారి నిజాయతీని గుర్తించ బట్టే కదా. ఇలాంటి వార్తలు చదివి మరింత మంది ప్రేరణ పొందాలని, మంచి మార్గంలో నడవాలన్న ఆలోచన వారిచే ఆ వార్తలు రాయించింది.

అలాంటి నిజాయతీ తెలిపే సంఘటన ఒక ప్రముఖుడి జీవితంలో జరిగింది. అది చదువుదాం.

ఒక యువకుడు ఒక కిరాణా దుకాణంలో పనిచేసేవాడు. అతని దుకాణానికి టీ పొట్లం కొనడానికి పొద్దున్నే ఒక రైతు వచ్చాడు. ఆ రైతుకి టీ పొట్లం ఇచ్చాడు యువకుడు. చిల్లర తిరిగి ఇచ్చేటప్పుడు పొరపాటున ఆరు సెంట్లు తక్కువ ఇచ్చాడు . మరెవరో వచ్చి సరుకులు కొనడంతో ఆ బేరం ఇవ్వడంలో మునిగిపోయాడు యువకుడు. తొందరలో ఉన్న రైతు కూడా యువకుడిచ్చిన డబ్బు తీసుకొని వెళ్ళిపోయాడు .

ఆ రాత్రి దుకాణం కట్టేస్తున్నప్పుడు డబ్బులు లెక్క చూసుకున్నాడు యువకుడు. ఆరు సెంట్లు ఎక్కువ వచ్చింది. ఉండాల్సిన దానికంటే ఎక్కువ ఎందుకు ఉందో ఎంత ఆలోచించినా యువకుడికి తట్టలేదు. బుర్ర బద్దలు చేసుకుని ఆలోచిస్తే ఆ రోజు పొద్దున్న రైతుకి టీ పొట్లం అమ్మిన విషయం , ఆరు సెంట్లు తక్కువ ఇచ్చిన విషయం గుర్తొచ్చింది.

అదే విషయాన్ని యజమానితో చెప్పాడు యువకుడు. ఆ విషయాన్ని పట్టించుకోకుండా 'ఆరు సెంట్లు కదా. పరవాలేదు' అని తేలిగ్గా తీసి పారేశాడు యజమాని. యువకుడు మాత్రం అదేపనిగా బాధపడటం చేసాడు. దాంతో యజమానికి కోపం వచ్చి ' ఆ రైతు ఉండేది పొరుగురులో. వెళ్లి ఇచ్చేసి వస్తావా' అని అడిగాడు కోపంగా .

అంతే ! యువకుడు చీకట్లో పొరుగూరు వెళ్లి రైతుని వెతికి పట్టుకున్నాడు. ఆరు సెంట్లు డబ్బు ఇచ్చేసి వెనక్కి వచ్చాడు.

యువకుడి నిజాయితీని ఊరంతా చాటాడు రైతు. ఆ యువకుడే తర్వాత కాలంలో అమెరికా అధ్యక్షుడు అయ్యాడు . అతడే అబ్రహం లింకన్. బ్రతుకు తెరువు కోసం ఎన్నో వ్యాపారాలు , ఉద్యోగాలు చేసినప్పటి కథ ఇది.

అబ్రహం లింకన్ యువకుడిగా ఉన్నప్పుడు చూపించిన నిజాయతి నేటికీ కథలుగా చెప్పుకుంటున్నామంటే నిజాయతీకి ఉన్న విలువ అలాంటిది.

రెండవది ఆర్థిక విలువలు. డబ్బు సంపాదించడం , ఉపయోగించడం మొదలైన వాటి విషయంలో న్యాయం, ధర్మం పాటిస్తూ, కష్టించి పని చేయడం, వృత్తి , వ్యాపారాల్లో మోసానికి తావివ్వకుండా సంపాదించడం చేయాలి. ఉన్న ధనాన్ని జాగ్రత్తగా ఖర్చు చేయాలి. అనవసరమైన వాటికి ఖర్చు పెట్టకుండా పొదుపు చేయాలి. ఇంటి యజమాని కష్టపడి సంపాదించిన డబ్బును కుటుంబంలోని వారు తెలివిగా ఉపయోగించాలి. పిల్లల భవిష్యత్తు కోసం కొంత పొదుపు చేయాలి. చిన్నప్పటి నుంచే ఆర్థిక విలువలు అలవరచుకుంటే పెద్దయ్యాక ఆర్థికంగా మంచి స్థితిని పొందుతారు.

మూడవది శాస్త్రీయ విలువలు. కొత్త విషయాలను తెలుసుకోవాలనే ఆసక్తి, జిజ్ఞాస కలిగి ఉండడం అందరికి అవసరం. ముఖ్యంగా విద్యార్థులకు తప్పనిసరి. చుట్టూ ఉన్న ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలి. ఎందుకు, ఏమిటి, ఎలా? అనే మూడు ప్రశ్నలు అడుగుతూ కొత్త విషయాలు తెలుసుకోవాలి. పరిశోధనలు చేయాలి. నిజాలను తెలుసుకోవడానికి ప్రయతించాలి. ఏదైనా ఉపయోగపడే ప్రయోగం చేసి

ఫలితాలను గమనించడం, కొత్త ఆవిష్కరణల గురించి తెలుసుకోవాలనే కుతూహలం నిరంతరం పెంచుకోవడం కూడా శాస్త్రీయ విలువల్లో భాగమే. ఈ విలువలు మనుషుల్లో జ్ఞానాన్ని, ఆలోచనా శక్తిని పెంచుతాయి.

నాలుగవది సామాజిక విలువలు. సమాజంలో అందరితో ఒకరిగా కలిసి మెలిసి జీవించాలి. సమాజంలో అందరితో స్నేహంగా ఉండటం, పక్కవారికి సహాయం చేయడం, అందరితో కలిసి మెలిసి ఉండటం, ఒకరినొకరు గౌరవించుకోవడం, వేరే వాళ్ల అభిప్రాయాలను వినడం వంటివన్నీ సామాజిక విలువలు. బడిలోనూ, వీధుల్లోనూ స్నేహితులతో ఆడుకునేటప్పుడు, గొడవ పడకుండా కలిసి పిల్లలు ఆడుకుంటే అది కూడా సామాజిక విలువ పాటించినట్టే . చుట్టూ ఉన్న ప్రజలతో సంతోషంగా జీవించడానికి సామాజిక విలువలు చాలా ముఖ్యమైనవి.

అయిదవది రాజకీయ విలువలు. దేశం పట్ల పౌరుడిగా, పాలకుడిగా బాధ్యతగా ప్రవర్తించడం. ప్రజాస్వామ్యాన్ని గౌరవించడం, ఓటు వేయడం, నిబంధనలను పాటించడం, అవినీతికి దూరంగా ఉండటం, అందరికీ సమానత్వం ఉండాలని కోరుకోవడం వంటివన్నీ రాజకీయ విలువలు. ఎన్నికల్లో ఓటు వేయడం, నాయకులను నిష్పక్షపాతంగా ఎంచుకోవడం, ప్రాంతీయ అభివృద్ధి కోసం పాటు పడడం కూడా రాజకీయ విలువ అవుతుంది. ఈ విలువలు పాటిస్తే సమాజాభివృద్ధి జరగడమే కాకుండా అభివృద్ధి పథంలో దేశం ముందడుగేస్తుంది.

వక్తులు ఏదైనా పదవికి ఎన్నికయితే ఆ పదవికి గౌరవం పెంచే విధంగా నడుచుకోవాలి . ఎటువంటి ఆటంకాలు వచ్చినా , ఎన్ని సమస్యలొచ్చినా వాటిని ధైర్యంగా ఎదుర్కొంటూ , ప్రలోభాలకు, ప్రభావాలకు లొంగకుండా నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి ఉండటమే రాజకీయ విలువలు పాటించడం. పాలకులుగా ఉంటూ విలువులు పాటించిన ఇద్దరు మహనీయులను ఈ సందర్భంలో గుర్తు చేసుకుందాం.

లాల్ బహుదూర్ శాస్త్రి మన ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు ఆయన కుమారుడికి అశోక్ లే ల్యాండ్ కంపెనీలో పదోన్నతి లభించింది. ఆ విషయం తెలిసిన శాస్త్రి గారు కొడుకుని పిలిచి “నీ కంటే ముందు చేరిన ఉద్యోగులు ఎందరో ఉండగా నీకు పదోన్నతి కలిగించడం ఆశ్చర్యంగా ఉంది. నీకు పదోన్నతిని ఎరగా వేసి దేశ ప్రధానినైన నా నుండి వారేదో ఆశిస్తున్నారు. ఆ పదోన్నతి వదులుకో. లేదంటే నేను నా పదవిని వదులుకుంటాను” అని చెప్పారు. విలువలకు ఆయన ఎంత ప్రాధాన్యత ఇచ్చేవారో దీనిని బట్టి మనం తెలుసుకోవచ్చు .

అబ్దుల్ కలాం గారు భారత రాష్ట్రపతిగా పని చేసినంత కాలం ఉన్నత విలువలు పాటించారు. పదవీ విరమణ పొందిన అనంతరం ఆయన సొంత గృహానికి వెళుతున్నప్పుడు ఆయన దగ్గరున్న ఆస్తి అంతా కలిపి కొన్ని జతల బట్టలు , మరికొన్ని పెట్టెల్లో పుస్తకాలు మాత్రమే. జీవితమంతా విలువల్ని బోధించడమే కాకుండా పాటించిన గొప్పవారు జన్మించిన దేశంలో పుట్టడం మన అదృష్టం గా భావించాలి.

ఆరవది కుటుంబ విలువలు.

తన సతి ఇడగా మనుమలు/

తనయులు తల్లిదండ్రులన్నదమ్ముల్ బంధుల్ /

దిన దినములు భుజియించుట /

ఘనవిభవము కుంద కవి చౌడప్పా !

అంటారు చౌడప్ప శతకంలో .

దాని భావమేమంటే తన భార్య ఆనందంతో, సంతోషంతో భోజనం వడ్డిస్తుండగా మనుమలు, తల్లిదండ్రులు , అన్నదమ్ములు, బంధువులు అందరూ కలిసి రోజు భోజనం చేయడం గొప్ప వైభవం కదా! . ఆహా ! ఇలా కదా కుటుంబం ఉండాల్సింది. అలా ఉండాలంటే తప్పక పాటించాల్సినవి కుటుంబ విలువలు.

ఆప్యాయ తానురాగాలు చూపిస్తూ , బంధాలను గౌరవించినప్పుడే కుటుంబ సభ్యులు సంతోషంగా ఉండగలరని గుర్తించడమే కుటుంబ విలువలు పాటించడం. కుటుంబ సభ్యుల పట్ల మనం ఎలా ప్రవర్తిస్తామనేది, వారికెంత ప్రాధాన్యత ఇస్తామనేది తెలుపుతుంది. అమ్మానాన్నలను గౌరవించడం, అన్నా తమ్ముళ్లు, అక్కాచెల్లెళ్లను ప్రేమగా చూసుకోవడం, తాతయ్య, నాన్నమ్మ, అమ్మమ్మ వంటి పెద్ద వాళ్లకు సహాయం చేయడం, కుటుంబంతో సరిపడినంత సమయం గడపడం, ఒకరికొకరు మద్దతుగా ఉండటం వంటివి ఆ వ్యక్తి పాటిస్తున్న కుటుంబ విలువలు గా చెప్పవచ్చు. కుటుంబ బంధాలు బలపడటానికి, ఆనందంగా ఉండటానికి కుటుంబ విలువలు చాలా ముఖ్యం. కుటుంబ విలువలు పాటించిన వారి గురించి పురాణాలు ఎన్నో కథలు రాశాయి. వాటిని తెలుసుకునే ముందొక పద్యం చేదువుదాం.

ఉన్న ఘనత బట్టి మన్నింతురే కాని/

పిన్న పెద్ద తనము సెన్న బోరు/

వాసుదేవు విడిచి వసుదేవు నెంతురా ?

విశ్వదాభిరామ వినుర వేమ !

అంటాడు కవి వేమన.

మనిషి ఎన్ని గొప్ప గుణాలు కలిగి ఉంటే సంఘంలో అంత గొప్పగా గౌరవించబడతాడు . గొప్పతనానికి వయసుతో పని లేదు. వాసుదేవుడైన శ్రీకృష్ణుడు తన తండ్రి అయిన వసుదేవుడి కంటే ఎక్కువగా గౌరవించి పూజించబడుతున్నాడంటే దానికి అతని గొప్ప గుణాలే కారణం. అలాంటి ఉత్తమ వ్యక్తిత్వం కలిగిన పురాణ పురుషులున్నారు. వారిని ఆదర్శంగా తీసుకోవాలి.

రామాయణంలో శ్రీరాముడు కుటుంబ విలువలకు ప్రాధాన్యత ఇచ్చే ఆదర్శ పురుషుడు. పితృవాక్య పాలనతో లోకానికి బలమైన సందేశం పంపిన దేవుడి అవతారం ఆయనది. ముందురోజు రాత్రి రాజ పట్టాభిషేకం చేస్తానని చెప్పిన తండ్రి నోట, మరునాటి ఉదయమే అడవులకు వెళ్లి పద్నాలుగేళ్ల పాటు వనవాసం చేయమన్న మాట వచ్చినప్పుడు తండ్రిని దూషించలేదు శ్రీరాముడు . ఎలాంటి వ్యతిరేక భావాన్ని కనబరచలేదు. తనని అడవులకు వెళ్ళమని రెండు వరాలు కోరిన పినతల్లి కైకేయిని కూడా ద్వేషించలేదు. మారుమాట్లాడకుండా 'అలాగే తండ్రీ' అన్నాడంటే తండ్రి పట్ల రాముడి కున్న ప్రేమాభిమానాలు , గౌరవం తెలుస్తోంది.పెద్దల పట్ల పిన్నలు చూపాల్సిన వినయానికి మచ్చుతునక శ్రీరాముడి ప్రవర్తన.

గుడ్డివారైన తల్లిదండ్రులను కావిడలో కూర్చుండబెట్టి బరువు మోసుకెళుతూ , కంటికి రెప్పలా కాపాడిన శ్రావణ కుమారుడు కూడ కుటుంబ విలువలకు సరైన అర్థం చెప్పాడు.

వృద్ధులైన తల్లిదండ్రులను అనాధాశ్రమంలో వదిలేయడం, ఆస్తుల కోసం అన్నదమ్ముల గొడవలు వంటి విచారకరమైన సంఘటనలు ఈ కాలంలో తరచూ జరుగుతున్నాయి. శ్రీరాముడు, శ్రావణ కుమారుడు మొదలైన వారి ప్రవర్తన తెలిపే పురాణ కథలు చదివైనా నేటి తరం మారాలి.

ఏడవది విద్యా విలువలు**.** విద్య అనేది కేవలం పుస్తకాల పరిజ్ఞానం మాత్రమే కాదు. ఒక వ్యక్తిని సంపూర్ణంగా తీర్చిదిద్దే ప్రక్రియ. లోకాన్ని, విజ్ఞానాన్ని అర్థం చేసుకోవడానికి, కొత్త విషయాలు నేర్చుకోవడానికి, జ్ఞాన సముపార్జన చేయడానికి విద్యయే తొలి మార్గం. విద్యా విలువలు పాటించే వారికి జ్ఞాన సముపార్జన, నైతికత, క్రమశిక్షణ , సృజనాత్మకత , ఆవిష్కరణ, సమానత్వం, సామరస్యం మరియు స్వయం సమృద్ధి అనే ప్రయోజనాలు కలుగుతాయి.

విశ్లేషణాత్మక ఆలోచనలను, సమస్యా పరిష్కార నైపుణ్యాలను మనుషుల్లో పెంచుతుంది విద్య . మంచి చెడుల విచక్షణ, సామాజిక బాధ్యత, క్రమశిక్షణ బోధిస్తుంది. బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దుతుంది. కొత్త ఆలోచనలను కలిగిస్తుంది. పరిశోధనలతో కూడిన అభివృద్ధి వైపు నడిపిస్తుంది. అందరికీ సమాన అవకాశాలు కల్పిస్తూ , సామాజిక అంతరాలు తగ్గించి, మనుషుల్లో సామరస్యాన్ని పెంచుతుంది విద్య. ఆర్థికంగా, సామాజికంగా స్వయం సమృద్ధిని సాధించడానికి సహాయపడుతుంది.

ఎనిమిదవది ఆధ్యాత్మిక విలువలు**.**

పదుగురుకి హితవు సంప/

త్ప్రదమును శాస్త్రోక్తమైన పద్ధతి నడువన్ /

జెదరదు సిరి హరిభక్తియు /

గుదురునుగద మదిని నెన్న గువ్వలచెన్నా ! అంటారు శతకకర్త .

దాని భావమేమంటే పదుగురుకీ మంచి చెయ్యడం, ఐశ్వర్యాన్ని ఇచ్చేయడం, శాస్త్రోక్త పద్ధతిలో నడవడిక ఉంటే , మనసులో , హరిభక్తి చెదరక కుదురుగా ఉంటుంది.

శతకకర్త చెప్పినట్టు జరగాలంటే పాటించాల్సినవి ఆధ్యాత్మిక విలువలు. అంతర్గత శాంతికి, మానసిక స్థిరత్వానికి, జీవన అర్థాన్ని తెలుసుకోవడానికి సహాయపడతాయి ఆధ్యాత్మిక విలువలు. మతంతో సంబంధం లేకుండా మానవత్వాన్ని, విశ్వ ప్రేమను వ్యాపింపజేస్తాయి. కరుణ మరియు ప్రేమను హృదయాల్లో నింపుతూ ఇతరుల పట్ల దయ, ప్రేమ, సహానుభూతితో ప్రవర్తించేలా చేసేవి ఆధ్యాత్మిక విలువలు. మనసులో శాంతిని పెంచుకోవడం, ఇతరుల అభిప్రాయాలు భిన్నమైనవైనా సరే అంగీకరించడం, ఎదుటి వాళ్ళ పట్ల సహనంతో ఉండటం నేర్పుతాయి. జీవితంలో లభించిన వాటి పట్ల కృతజ్ఞత కలిగి ఉండేలా సానుకూల దృక్పథాన్ని పెంచుకునేలా మనుషుల్ని ప్రోత్సహిస్తాయి. లాభాపేక్ష లేకుండా ఇతరులకు సేవ చేయడం, సమాజ శ్రేయస్సు కోసం కృషి చేయడం వంటి లక్షణాలను పెంచుతాయి. తనను తాను అర్థం చేసుకోవడం, తన బలాలు, బలహీనతలను తెలుసుకోవడం కోసం మనిషిని సిద్ధం చేస్తాయి. అన్ని వ్యవహారాల్లో నిజాయితీగా ఉండటం, ధర్మాన్ని పాటించడం అలవాటు చేస్తాయి.

విలువలు పొందడం అంటే మంచి లక్షణాలు అలవరచుకోవడం. అవి ఎలా పొందవచ్చునో వ్యాసం చివర్లో చర్చించుకుందాం.

సత్యసూక్తి ఘటించు ధీ జడిమ మాన్చు

గౌరవ మొసంగు జనులకుఁ గలుష మడఁచు

గీర్తిఁ బ్రకటించు చిత్తవి స్ఫూర్తిఁజేయు

సాధుసంగంబు సకలార్థ సాధనంబు

అని ఒక శతకకర్త చెప్పారు.

దాని భావమేమంటే సజ్జనులతో చేసే స్నేహం వల్ల బుద్ధి మాంద్యము నశిస్తుంది. అలాంటి సహవాసం చేత సత్యమే పలుకుతారు. పాపాలను నాశనం చేసి , మనస్సును శుభ్రపరచి , మంచి గౌరవం నిచ్చి , నలుదిక్కుల లో కీర్తిని వ్యాపింపజేస్తుంది. మంచి వారి సహవాసం వల్ల లభించే మంచిని మించింది ఏ లోకములోనూ లేదు. అందుకే మంచి శీలం , నడవడిక ఉన్నవారితో స్నేహం చేసి అవలక్షణాలను వదిలించుకోవాలి. మంచి వారితో కలసి నడవడం వల్ల తప్పక మంచి జరుగుతుంది.

మంచి విలువలు అలవడాలంటే తప్పక మంచి మిత్రులు కలిగి ఉండాలని , సజ్జనుల సహవాసంతో మనలోని చెడు లక్షణాలను వదిలించుకుని మంచివారిగా మారవచ్చని శతకకర్త బోధించాడు. అలా చేసినప్పుడు మనుషులు విలువలున్న వారిగా మారతారు.

విలువలు మనకు దారి చూపే దీపస్తంభాల లాంటివి. అవి దారిని మాత్రమే చూపిస్తాయి. త్రోవ తెలుసుకుని విలువలున్న వెలుగు దారుల్లో నడవాల్సింది మాత్రం మనమే. అది మన బాధ్యత. విలువలు మన మనసులోని చెడ్డ ఆలోచనల చీకట్లను తరిమేసి వెలుగులు నింపే జ్యోతుల వంటివి . మనం ఎంత చదువుకున్నా, ఎంత తెలివిగా ఉన్నా, మంచి విలువలు లేకుంటే అసంపూర్ణం అవుతుంది.

అందుకే పిల్లలందరూ చిన్నప్పటి నుంచే మంచి విలువలు అలవర్చుకోవాలి. మంచి విలువలతో జీవిస్తే జీవితం బాగుంటుంది. సమాజం కూడా సంతోషంగా, శాంతిగా వర్ధిల్లుతుంది. విలువలు జీవితానికి చాలా అవసరం. ఒక్కో విలువ మనిషిని ఒక్కో రకంగా ఉన్నతులను చేస్తుంది.

మంచి నైతిక విలువలు కలిగి ఉన్నవారిని అందరూ ఇష్టపడతారు. ఆర్థిక విలువలు ఉంటే భవిష్యత్తులో ధన సంబంధమైన కష్టాలు తప్పుతాయి. శాస్త్రీయ విలువలు ఉంటే జ్ఞానవంతులు అవుతారు. సామాజిక విలువలు ఉంటే అందరితో కలిసి సంతోషంగా జీవించగలుగుతారు. కుటుంబ విలువలు పాటిస్తే చక్కని ఆనందకరమైన కుటుంబ జీవితం దక్కుతుంది. ఆధ్యాత్మిక విలువలు పాటిస్తే మనశ్శాంతి దొరుకుతుంది. ప్రశాంతత దక్కుతుంది. చిన్నప్పటి నుంచే విలువలు నేర్చుకుంటూ జీవితంలో పాటిస్తే గొప్ప వ్యక్తిగా రూపు దిద్దుకుంటారు.

సద్గోష్ఠి సరియు నొసగును /

సద్గోష్ఠియె కీర్తి బెంచు సంతుష్టిని నా /

సద్గోష్ఠియె యొనగూర్చును /

సద్గోష్ఠియె పాపములను జంపు కుమారా! అంటోంది కుమార శతకం .

దాని భావమేమంటే “ఓ కుమారా ! సజ్జనులతో సహవాసము , మాటలాడుట , సంపదలను కలిగించును. కీర్తిని వృద్ధికి తెచ్చును. తృప్తి కలిగించును. పాపములను పోగొట్టును. కాబట్టి సజ్జనులతో స్నేహం అవశ్యం చేయతగినది.”

చివరగా ఒక్క మాట. ‘విలువలు పతనం అవ్వడం కన్నా విలువల పట్ల విశ్వాసం క్షీణించడం మరింత ప్రమాదకరం’ అన్న పెద్దల మాట దృష్టిలో పెట్టుకుని ఉన్నతమైన విలువల్ని కాపాడుకుంటూ, అవే విలువల్ని జీవితంలో పాటిస్తూ చక్కటి సమాజ నిర్మాణంలో భాగస్వాములు అవుదాం.

పిల్లలూ! మీరు కూడా మంచి లక్షణాలు అలవరచుకుంటారు కదూ. చక్కని ప్రవర్తనతో ఇంట్లో అమ్మానాన్నల నుండి , బడిలో గురువుల నుండి మెప్పు పొందే విధంగా నడుచుకుంటారు కదూ .

—--****-------